జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761


epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 7-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 476 పేజీలు: 4 వెల : రూ.7



## విద్యుత్ శాఖలో..

# లంచావతారులు





* మామూళ్లు ఇవ్వకపోతే అధికారుల చుట్టూ తిరగాల్సిందే * అదనంగా ముట్టజెప్పకపోతే ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు, కనెక్షన్లు కష్టమే * కొందరు ఏఈలు, డీఈలు, లైన్‌ఇన్‌స్పెక్టర్లే దళారులు * కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తున్న ఆ శాఖ ఉన్నతాధికారులు * గుట్టుగా సాగుతున్న విజిలెన్స్ విచారణ



**శ్రీకాకుళం, అక్టోబర్ 6 (వార్త):** శ్రీకాకుళం విద్యుత్ శాఖలో అవినీతి జలగలు రాజ్యమేలుతున్నాయి. కొంత మంది అధికారులు, సిబ్బంది వినియోగదారులను, రైతులను పట్టిపీడిస్తున్నారు. పైసలు ముట్టందే ఫైల్‌పై సంతకాలు కూడా పెట్టడం లేదు. వినియోగదారులు నుంచి ప్రతి పనికి ఓ రేటు కట్టి వసూళ్లకు పాల్పడుతున్నారు. పలు మండలాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది మొదలుకొని ఓ స్థాయి అధికారుల వరకు పైసలు ముట్టందే పనిచేయరన్న వాదనలు ఆయా వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది వ్యవహారాలు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు తెలియందీ కాదు. అయితే అధికారులు పట్టించుకోకపోవడం, వారిలోను కొంత మంది మామూళ్లకు అలవాటు పడటంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కాగా జిల్లాలోని పలువురు అధికారులు, సిబ్బందిపై వినియోగదారుల నుంచి సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదులు ఉన్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. విద్యుత్ మీటర్లు, స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్ల కోసం అడిగినంత ఇవ్వకపోతే ఏవో కారణాలు చెప్పి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిప్పుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. నూతనంగా ఇల్లు నిర్మించే వారు కనెక్షన్ తీసుకోవాలంటే కనీసం రూ.5వేలు వరకూ ఇవ్వాల్సిందే. అదే అపార్టుమెంట్ అయితే వాటిరేటు సెపరేటు. ఇక ట్రాన్స్ ఫార్మర్ కావాలంటే రూ.20 వేలు వరకూ అదనంగా ఇచ్చుకోవాల్సిందే. ఇక లైన్ మార్చాలన్నా, స్తంభాల మార్పు ఇలా ప్రతి పనికి పైసలివ్వందే పనులు జరగడం లేదు. ఎవరు ఎక్కువ సొమ్ము ముట్టచెబితే వారికి సంబంధించిన పనులు వేగంగా అవుతాయి. అందులో ఎలాంటి అడ్డంకులు, నిబంధనలు ఉన్నా వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా పనులు చేసేస్తున్నారు. ఇక డబ్బులు ఇవ్వని వారి పరిస్థితి చెప్పనవసరం లేదు. వారి పనులు కోసం నిత్యం విద్యుత్ కార్యాలయాలు, అధికారులు, సిబ్బంది చుట్టూ ప్రదక్షిణలు తప్పడం లేదు. అడిగే నాధుడే లేక కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ట్రాన్స్ఫార్మర్ కాలిపోతే ఒక్క రూపాయ ఖర్చు లేకుండా దాని స్థానంలో కొత్త దానిని అమర్చాల్సి ఉంది. ఈ విషయంలో కూడా ప్రజలు అవసరాన్ని ఆసరాగా చేసుకొని రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పైగా నూతన ట్రాన్స్ ఫార్మర్ కోసం డీడీలు తీసిన రైతులు కూడా ఎదురుచూస్తున్నారు. సీనియర్ జాబితాను పక్కనపెట్టి కొత్తగా డీడీలు తీసిన కొందరు రైతుల నుంచి అదనంగా రూ.10వేల నుంచి 20వేల వరకూ వసూలు చేసి వారికి వెంటనే ట్రాన్స్ఫార్మర్ అందజేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస, టెక్కలి విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అవినీతి హెచ్చుమీరుతుండడంతో కొంతమంది వినియోగదారులు, రైతులు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారులు విజిలెన్స్ అధికారులతో గుట్టుగా విచారణ చేయిస్తున్నట్టు సమాచారం.

(విద్యుత్ శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది అక్రమాలు, దందాలు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు, రియల్టర్లకు కొమ్ము కాస్తున్న వారిపై త్వరలో 'జాతీయ వార్త'లో సమగ్ర కథనాలు)




## వివాహిత అనుమానాస్పద మృతి

* జీడితోటల్లో మృతదేహం




**మందస, అక్టోబరు 6(వార్త):** మందస మండలంలోని మఖరజోల పంచాయతీ అల్లిమెరకకాలనీ గ్రామానికి చెందిన కొండ కురమ్మ(26) అనుమానాస్పందంగా మృతి చెందింది. ఉదయాన్నే తోటల్లోకి వెళ్లిన కురమ్మ చాలా సమయం వరకు తిరిగి ఇంటికిరాలేదు. ఆమె కనిపించకపోవడంతో పరిసరాలతో పాటు తోటల్లో కుటుంబీకులు వెదికారు. చివరకు రంగోయి జీడితోటల్లో శవమై కనిపించింది. రెండు రోజుల క్రితమే కన్నవారింటి నుంచి ఆమె అత్తవారింటికి వచ్చింది. ఏమైందో.. ఏమో కానీ, చెట్టు కొమ్మకు విగతజీవిగా వేలాడుతూ కనిపించింది. మృతురాలి భర్త చంద్రశేఖర్ దుబాయిలో పని చేస్తున్నాడు. కురమ్మకు ఐదేళ్ల కార్తీక్, మూడేళ్ల ప్రేమ్ కుమార్ అనే ఇద్దరు పిల్లలున్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని, శవపంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# చెత్తను సంపదగా మార్చాలి

* ప్రతి సచివాలయంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాలు * కిలో చెత్తకు రూ.10 చెల్లిస్తాం
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర 2025 అవార్డుల ప్రదానం




**శ్రీకాకుళం, అక్టోబరు6(వార్త):** పరిశుభ్రతను ప్రజా జీవితంలో భాగం చేయాలని, చెత్తను సంపదగా మార్చే దిశగా ప్రజలు కృషి చేయాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు-2025 ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ నాటికి జిల్లాలో 95 శాతం ఇంటింటికీ చెత్త సేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అలాగే, బహి రంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా 623 గ్రామాలను ప్రక టించడం, తొమ్మిది మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి లక్ష్యాలను వివరించారు. ఈ కృషికి తోడు రాష్ట్ర స్థాయిలో రెండు, జిల్లా స్థాయిలో 46 స్వచ్ఛ అవా ర్డులు శ్రీకాకుళం జిల్లాకు దక్కడం గర్వకారణమని ఆయన అభి నందించారు. ప్రతి సచివాలయంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, పౌరుల నుంచి సేకరించిన కిలో చెత్తకు రూ.10చెల్లిస్తామని తెలిపారు. ప్రజలు రోడ్లపై, కాలువ ల్లో చెత్త వేయకుండా శానిటరీ వర్కర్లకు సహకరించాలని కోరారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒక స్వచ్ఛ సేవకుడు తయారు కావాలని కోరారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ మహమ్మారిపై యుద్ధం చేయాలని, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజాప్రతినిధులు అభి నందించి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్విరాజ్ కుమార్, డీపీఓ భారతి సౌజన్య, సీపీఓ ప్రసన్న లక్ష్మీ, ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



## సీజేఐపై దాడికి యత్నం దుర్మార్గపు చర్య : తైక్వాండో శ్రీను



**శ్రీకాకుళం, అక్టోబరు 6(వార్త):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై దాడి యత్నాన్ని అంబేద్కర్స్ ఇండియామిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను తీవ్రంగా ఖండించారు. కేసు విచారణ జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి సీజెఐపైకి బూటు విసరడానికి ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమైన అప్రజాస్వామ్యమైన చర్యగా పేర్కొ న్నారు. “సీజెఐపై దాడి యత్నంభారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ గౌరవం, ప్రజాస్వామ్య విలువలపై దాడి చేసినట్లే” అన్నారు. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడికి యత్నించిన వ్యక్తిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే సుప్రీం కోర్టు ప్రాంగణంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

**-పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, అక్టోబరు 6(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం పలాస ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ వినతదులపై తక్షణం స్పందిస్తూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ప్రజా దర్బార్ లో ముఖ్యంగా నియోజకవర్గం నుంచి ప్రజలు పెన్షన్లు, రేషన్ కార్డుల సమస్యల కోసం వినతులు అందించారు. తమకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కొందరు ఎమ్మెల్యే గౌతు శిరీషకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, నిరుద్యోగులకు త్వరలో ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, ముఖ్యమంత్రి కూడా ఈ విషయంపై స్పందించారని, తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్లు, కాలువల నిర్మాణం వంటి కనీస వసతులపై అధికంగా విజ్ఞప్తులు వస్తున్నాయని, గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కనీస వసతులను కల్పించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపనకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు.

కార్యక్రమంలో కూటమి నాయ కులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

# సమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి




**శ్రీకాకుళం, అక్టోబరు 6(వార్త):** భారతదేశంలో పుట్టిన వాకర్స్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా విస్తరించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుందని ఈ సంస్థలో ప్రతిష్టత్మకమైన మహాత్మా గాంధీ ఫెలోషిప్‌లో వివిధ రంగాల ప్రముఖులు చేరాలని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి పిలుపునిచ్చారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్ కొంక్యాన మురళీధర్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ ఫెలోషిప్‌లో చేరిన వివిధ రంగాల ప్రముఖులను నగరంలోని కెమిస్ట్ భవనంలో ఆదివారం రాత్రి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి సమాజం నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 201 గవర్నర్ గుంటూరి రామరాజు, 302 గవర్నర్ రావెళ్ల మాధవ నాయుడు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ హారిక ప్రసాద్, జిల్లా చైర్మన్ నటుకుల మోహన్, ఫిజియోథెరపిస్టు డాక్టర్ బి.శ్రీనివాస పట్నాయక్, వాకర్స్ పూర్వ గవర్నర్ పోలుమహంతి ఉమామహేశ్వరరావు, జెసిఐ కార్యదర్శి తమ్మినేని ఉషారాణి, వాకర్స్ 102 కార్యదర్శి సుగంధం సంజీవ రావు, కోశాధికారి చదువుల బసవరాజు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కొంక్యాన వేణుగోపాల్, నల్లి ఆశా దీపిక, పాండ్రంకి మురళీకృష్ణ, పొట్నూరు నాగేశ్వరరావు, పంచాది నారాయణమూర్తి, సకలాభక్తుల గోవిందరావు, కోరాడ విశ్వనాథం, రవ్వ నారాయణరావు, డాక్టర్ రమేష్‌చంద్ర సాహు తదితరులు పాల్గొన్నారు.

### గోవిందరాజులు ట్రస్టు ఆర్.ఓ.ప్లాంట్ వితరణ

కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి అన్నారు. గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొంక్యాన మురళీధర్ ఆధ్వర్యంలో నగరంలోని మదర్ థెరిసా హోమ్‌లో రూ.60వేల విలువైన ఆర్.ఓ.వాటర్ ప్లాంట్‌ను ప్రభావతి ప్రారంభించారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు నివాసం ఉంటున్న మదర్ థెరిసా హోమ్‌లో నిరంతరం ఆహార పదార్థాలు అందజేయడంతో పాటు వాటర్ ప్లాంట్ ను అందించిన ట్రస్ట్ సభ్యులకు ప్రభావతి అభినందించారు. భవిష్యత్తులో ఈ ట్రస్ట్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కొంక్యాన ట్రస్ట్ చైర్మన్, వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్ మురళీధర్ నేతృత్వంలో మదర్ థెరిసా హోంలో ఉన్న వృద్ధులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కొంక్యాన శివశంకర్, కొంక్యాన కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యంపై అధిక ధరలను అరికట్టండి



**పలాస, అక్టోబరు 6(వార్త):** జిల్లాలో ఏ ప్రాంతంలో లేని విధంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మద్యం వ్యాపారస్తులు సిండికేట్ గా ఏర్పడి ఎం ఆర్ పి పైన అధిక ధరలు వేసి పేద ప్రజల రక్తాన్ని పిండేస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యాన్ని తూట్లు పొడుస్తున్నారని సామాజిక వేత్త మాన్యాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, కాశీబుగ్గ ఎక్సైజ్ సీఐలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం వ్యాపారస్తుల పైన యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొని ఎంఆర్ పి ధరలకే మద్యం అమ్మకాలు జరిగే విధంగా చూడాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటించవలసిందిగా ఎక్సైజ్ అధికారులకు ఆయన కోరారు. దీనిపై స్పందిస్తూ నేటి నుంచి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఎమ్ ఆర్ పి ధరలకే మద్యం అమ్మే విధంగా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సి ఐ హామీ ఇచ్చారని, ఏ మద్యం దుకాణాల నిర్వహకులు ఎం ఆర్ పి ధరలకు అధికంగా అమ్మకాలు జరిపితే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించవలసిందిగా కోరినట్లు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా యమ్.ఆర్.పి.పై అధికంగా రేట్లు పెంచి అమ్మకాలు చేస్తున్నారని, సామాన్య ప్రజలు ప్రశ్నిస్తే నీ దిక్కున వాడికి చెప్పుకో అని వైన్ షాపుల సిబ్బంది నిర్లక్ష్యంగా బదులిస్తున్నారని అన్నారు. నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలను కూడా పక్కన పెట్టి మద్యం వ్యాపారస్తుల సిండికేట్ పై చర్యలు తీసుకోవలసిందిగా, అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకిచ్చిన హామీని నిలబెట్టవలసినదిగా కోరారు. అదే విధముగా వివిధ గ్రామాలలో అనేక బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి అక్కడ కూడాను మద్యం సిండికేట్ వ్యాపారులు అత్యధిక ధరలతో ప్రజలను బెంబేలిస్తున్నారని, అసలు వలాస-కాశీబుగ్గలో ఎక్సైజ్ అధికారులు ఉన్నారా..?లేరా..? అనే విధంగా మద్యం సిండికేట్ వ్యాపారస్తులు చేస్తున్న ఆగడాలను యుద్ధప్రాతిపదికన ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపి చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎక్సైజ్ అధికారులు స్పందిస్తూ నేటి నుంచి పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఎమ్ ఆర్ పి ధరలకే అమ్మకాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ హామీ ఇచ్చారని, మద్యం దుకాణాల నిర్వహకులు ఎం.ఆర్.పి ధరలకు అధికంగా అమ్మకాలు జరిపితే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ కోరినట్లు శ్రీనివాస్ తెలిపారు.



# విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

**కోటబొమ్మాళి, అక్టోబరు 6(వార్త) :** ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం వండి పెట్టాలని రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కార్పోరేషన్ చైర్మన్ చితా విజయప్రతాప్రెడ్డి అన్నారు. ఆయన సోమవారం రాత్రి స్థానిక ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఏరోజు ఏఏ ఆహారం పెడుతున్నారు,

వారానికి ఎన్ని కోడి గుడ్డు అందిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుక ఎన్నారు. అలాగే విద్యార్థులకోసం రాత్రికి తయారు చేసిన భోజనాన్ని తిని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈయనతో పాటు సంఘీక సంక్షేమ సహాయ అధికారి గురువెళ్ళి వెంకట విజయలక్ష్మి, ఎస్సీ వసతి గృహ సంక్షేమ అధికారి కొన్న సీతారాం తదితరులు ఉన్నారు



## రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీసత్యసాయి విద్యా విహార్ విద్యార్థుల ఎంపిక

**పలాస, అక్టోబరు 6(వార్త):** శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీలో రామకృష్ణాపురంలో ఉన్న శ్రీ సత్య సాయి విద్యావిహార్ విద్యార్థులు అండర్ 17 విభాగంలో ఎస్.గౌతమ్, జి.దీక్షిత్, పి కిరణ్మయి, అండర్ 14 విభాగంలో టి సుజిత, ఎస్.లోహిత్, జి.వరుణ్, బి. చరిష్మా, ఎ.జయశ్రీ ఎంపికయ్యారు. పాఠశాల వ్యాయమోపాధ్యాయుల ను కిరణ్, గురునాథ్ శిక్షణతో, అద్భుతమైన ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి త్రో-బాల్ పోటీలకు ఎంపిక కావడంపై వ్యాయామోపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు, కోచ్‌లకు శ్రీసత్యసాయి సేవాసంస్థలు రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, జోనల్ కన్వీనర్ బైరాగి మాస్టర్, ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉప అధ్యక్షులు తాలాసు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి అభినందించారు.

## జీఎస్టీ 2.0 పై అవగాహన




**పలాస, అక్టోబరు 6(వార్త):** నగరంపల్లి జడ్పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూపర్ జిఎస్టీ 2.ఓ (వస్తు సేవల పన్ను) పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు సూపర్ జిఎస్టీ - సూపర్ సేవింగ్స్ అనే అంశం పైన వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం ఇదే అంశంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు తలగాన హేమరావు ఆధ్వర్యంలో జరగగా, పీఎంసీ చైర్మన్ బి. లక్ష్మీపతి, ఉపాధ్యాయ సిబ్బంది కే. రమణ, టి. ఎర్రన్న, పి. సోమేశ్వరరావు, కొయ్యల శ్రీనివాస రావు, సీహెచ్.ఉమారావు, వై. కాళిదాసు, ఎం. అప్పలస్వామి, ఆర్. ఇంద్రసేనరావు, ఎన్. గౌరునాయుడు, జి. విశ్వనాథం, సుజాత పాల్గొన్నారు.

## టి.గంగువాడ పాఠశాలకు బీరువా, కుర్చీల వితరణ



**మందస, అక్టోబరు 6(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన టి.గంగవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన పూర్వ ఉపాధ్యాయులు సత్యం, విజయ దంపతులు, సురేష్, అరుణ దంపతులు సుమారు రూ.20వేలు విలువ చేసే బీరువాను అందజేశారు. అదేవిధంగా లైసెట్టి శ్యామల రావు, రాజేశ్వరి దంపతులు 8 కుర్చీలు బడి రుణం తీర్చుకుందాం కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు వితరణ చేశారు. దాతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొడ్డు ఉపేంద్ర అభినందించారు. పి.జయలక్ష్మి, గ్రామస్తులు, విద్యార్థులు అభినందించారు. దాతల సహకారంతో టి.గంగువాడ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి చెందిందని గ్రామ పెద్దలు తెలిపారు.

## మూడో విడత భూముల రీసర్వే

**ఇచ్ఛాపురం, అక్టోబరు6(వార్త):** భూముల మూడో విడత రీసర్వే చేపడుతున్నట్టు తహశీల్దార్ వెంకటరావు అన్నారు. కొఠారిలో అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, సర్వేయర్ పాత్రో, సాడి సహదేవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## భారీ వర్షాలకు రైతులకు నష్టం

**మందస, అక్టోబరు 6(వార్త):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులకు నష్టం జరిగిందని తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ కు మహేంద్ర రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. పొలాల్లో ఇసుక మేటలు వేయడం జరిగిందన్నారు. సింగుపురం గ్రామం సమీపంలో సునాముది గట్లు, దామోదరసాగరం ఛానల్ గట్లుకు గండ్లు పడ్డాయన్నారు. ఎంత నష్టం జరిగిందో వీఆర్వోలతో సర్వే చేయించాలని కోరారు. జీడి, కొబ్బరి, మామిడి, పనస, సపోటా, మునగ తదితర మొక్కలను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో మహేంద్ర రైతు సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు, కొర్ల హేమారావుచౌదరి పాల్గొన్నారు.





## కొత్తపల్లి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**మందస, అక్టోబరు 6(వార్త):** కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. దసరా పురస్కరించుకుని ఇటీవల వివిధ ప్రాంతాల్లో జరిగిన క్విజ్, ప్రతిభా పరీక్షల్లో మందస మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. రంగోయి గ్రామంలో జరిగిన జిల్లా స్థాయి గ్రూప్ టాలెంట్ టెస్ట్ లో 4వ స్థానంలో నిలిచి షీల్డ్, రూ.500లు, ఇసుకలపాలెంలో జరిగిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి షీల్డ్, రూ.4,001లు నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ విజేతలలో పి.కీర్తన, జీవన్ సింగ్ ఠాకూర్, గౌతమ్ సింగ్ ఠాకూర్, యన్.భార్గవి, కె.జ్ఞానేశ్వరి, కె.శ్రీజ, బి.సుస్మిత ఉన్నారు. విజేతలను పాఠశాల ప్రార్థనా సమయంలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యుడు కూన వేణు గోపాలరావు, ఉపాధ్యాయులు యస్.గణేశ్వరరావు, జి.భీమారావు, జి.జానకమ్మ, యమ్.లక్ష్మణరావు, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, యమ్.చిత్రసేను, యమ్.దామోదరం, జి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నెల రోజుల్లో 17మద్యం కేసుల నమోదు



**ఇచ్ఛాపురం, అక్టోబరు6(వార్త):** గత నెల రోజుల వ్యవధిలో 17 మద్యం కేసులు నమోదు చేసినట్లు సి ఐ పి.దుర్గా ప్రసాద్ చెప్పారు. సెప్టెంబరులో 14, ఈ నెల మొదటి వారంలో 3 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.నాన్ డ్యూటీ పెయిడ్ 7 కేసులు, డ్యూటీ పెయిడ్ 10 కేసులు నమోదు చేశామని చెప్పారు. అధిక ధరలకు మద్యం అమ్మితే 14405 లేదా 8639959250 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

## జిఎస్‌టి తగ్గింపుతో మేలు




**ఇచ్ఛాపురం, అక్టోబరు6(వార్త):** జిఎస్‌టి తగ్గింపుతో వినియోగదారులకు మేలు కలుగుతుందని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవశ్రీ మహంతి అన్నారు. జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రజనీ కుమారి,బాపూజీ యుగంధర్ చౌదరి,ప్రసాద్ జగదీష్, జనార్దన్ శాంతిశ్రీ, సునీత, లత తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి వితరణ



**శ్రీకాకుళం, అక్టోబరు 6(వార్త):** ఇలిసిపురంలో వెలసిన స్వయంభూ శ్రీశ్రీశ్రీ భద్రమహంకాళీ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణం నిమిత్తం కీ.శే "అడపా పరాంకుశం, వెంకటరత్నం (బుక్కావారు) జ్ఞాపకార్థము వారి మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవళ్లు కలసి లక్ష రూపాయలు ఆలయ నిర్మాణం నిమిత్తం ఆలయ నిర్మాణ కమిటీ వారికి చెక్కు రూపంలో అందించారు. అడపా పరాంకుశం వారసులు నిర్మిస్తున్న ఆలయ వద్ద గ్రామ కమిటీ వారికి చెక్కు రూపంలో లక్ష రూపాయలు అందజేయడం చాలా ఆనందంగా ఉన్నదని అడపా నేతాజీ తెలియజేశారు. ఈ సందర్భంలో అడపా ప్రభాకర్ మాట్లాడుతూ అమ్మవారిని మా తాతగారు ఇంటి ఆడపడుచు గా భావించే వారని దానికి నిదర్శనంగా అమ్మవారికి చీర పసుపు కుంకుమలతో చెక్కు అందజేయడం చాలా సంతృప్తిని ఇచ్చిందని వారసులు, కుటుంబ సభ్యులందరూ తెలియజేశారు.

## బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా బహిరంగ సభలు

**-8న గంగువాడ,**

**9న మసానపుట్టిలో సమావేశాలు**

**-విజయవంతం చేయాలని ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ పిలుపు**




**మందస, అక్టోబరు 6(వార్త):** బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్టు కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు, వెన్నెలవలస థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్ దొర, కార్యదర్శి సమర సింహాచలం ఉమ్మడిగా పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రారంభమవుతున్న ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని జిల్లాలోని కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు, వెన్నెలవలస థర్మల్ విద్యుత్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు సురేష్ దొర, కార్యదర్శి సవర సింహాచలం ఉమ్మడిగా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ నెల 8న మందస మండలంలోని గంగువాడ, 9న బూర్జ మండలంలోని మసానపుట్టిలో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా బహిరంగ సభలను విజయవంతం చేయాలని కోరారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఆంధ్ర ఉద్యమాల ఐక్యవేదిక శ్రీకాకుళం జిల్లా నుండి నంద్యాల జిల్లా వరకు పాదయాత్రనను నిర్వహిస్తోందని, ఈ పాదయాత్ర శ్రీకాకుళం జిల్లా నుండి అక్టోబరు 8వ తేదీన ప్రారంభమై నంద్యాల జిల్లా వరకు కొనసాగుతుందని.. గన్నవరం దగ్గర ముగుస్తుందన్నారు. అక్టోబరు 28వ తేదీన విజయవాడలో ముగింపు సభ ఉంటుందన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని వామపక్ష పార్టీలు, అన్ని ప్రజాసంఘాలు భాగస్వామ్యం కావాలని వారు కోరారు. 8న మందస మండలంలోని మీలగంగువాడలో ఉదయం 10గంటలకు, 9న బూర్జ మండలం మసానపుట్టిలో ఉదయం 10గంటలకు బహిరంగ సభలు ఉంటాయన్నారు. ఈ రెండు సభల్లో ఆంధ్ర ఉద్యమాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న పాదయాత్రకు చైర్మన్ గా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి, రైతు సంఘం నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు కన్వీనర్ గా బాధ్యత వహిస్తున్న మహాదేవతో పాటు రాష్ట్ర స్థాయి ఉద్యమ సంస్థల నాయకులు, జిల్లాలోని వామపక్ష ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని, పలు సాంస్కృతిక సంస్థల కళా ప్రదర్శనలు ఉంటాయని వారు తమ ప్రకటనలో వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయటానికి ఆయా ప్రాంతాల బాధిత గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని రెండు పోరాట కమిటీల నాయకులు పిలుపునిచ్చారు.

## అధికారులతో ఎమ్మెల్యే శిరీష సమీక్ష సమావేశం



**పలాస, అక్టోబరు 6(వార్త):** పలాస టిడిపి కార్యాలయం నందు సోమవారం పలు శాఖల అధికారులతో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సమీక్షసమావేశం నిర్వహించారు. ప్రధానంగా చర్చించిన అంశాలను శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గానికి వచ్చిన ఎరువులు, మండలాల వారీగా ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. తుఫాన్ కారణంగా జరిగిన పంట నష్టం వివరాలు, సాగు విస్తీర్ణం, పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ రాజ్ విభాగం నుంచి గత 15 నెలలుగా మంజూరైన పనులు, పూర్తయినవి, మొదలు కానివి ఎన్ని?, గతంలో ప్రారంభించబడి నేటికీ పూర్తి కాని రహదారుల వివరాలపై ఆరా తీశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు దెబ్బతిన్న రహదారులు ఎన్ని?, శాఖాపరంగా తీసుకున్న చర్యలు ఏమిటని? ప్రశ్నించారు. కొత్త గా ప్రతిపాదనలు ఉన్నాయా?, వాటి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆర్అండ్‌బిపై సమీక్ష చేస్తూ గత 15 నెలలుగా మంజూ రైన పనులు, పూర్తయినవి, మొదలు కానివి ఎన్ని? అని ప్రశ్నించారు. గతంలో ప్రారంభించబడి నేటికీ పూర్తి కాని రహదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు దెబ్బతిన్న రహదారులు ఎన్ని? శాఖాపరంగా తీసుకున్న చర్యలు ఏమిటి? అని ప్రశ్నించారు. కొత్తగా ప్రతిపాదనలు ఉన్నాయా? వాటి వివరాలు చెప్పాలన్నారు. ఇరిగేషన్ పై సమీక్ష చేస్తూ సమీక్ష చేస్తూగత 15 నెలలుగా మంజూరైన పనులు, పూర్తయినవి, మొదలు కానివి ఎన్ని? అని వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు దెబ్బతిన్న సాగునీటి వనరులు ఎన్ని? శాఖాపరంగా తీసుకున్న చర్యలు ఏమిటి? అని ప్రశ్నించారు. కొత్తగా ప్రతిపాదనలు ఉన్నాయా? వాటి వివరాలు ఏమిటని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూపై సమీక్ష చేస్తూ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ వివరాలు, ఇటీవల కురిసిన భారీ వర్షాలు కారణంగా పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ళ వివరాలపై నివే దిక ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కొత్త రేషన్ కార్డులు ప్రక్రియ వాటి వివరాలను అడిగి తెలుసు కున్నారు.

## వీజీ పురం కేజీబీవీని తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్

**మందస, అక్టోబరు 6(వార్త):**మందస మండలంలోని వీరగున్నమ్మపురం సమీపంలో గల కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ్ ప్రతాప్ రెడ్డి తనిఖీ చేశారు. వంటగది, స్టోర్ రూంను పరిశీలించారు. అనంతరం విద్యార్థినిలతో మాట్లాడారు. మెనూ, భోజనం ఎలా ఉంది.. అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలు తమ భవిష్యత్ ను చక్కగా మలచుకోవడానికి తీసుకోవాల్సిన ప్రణాళికలు చెప్పారు. ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కేజీబీవీ పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీబీసీడబ్ల్యూఓ అనురాధ, ప్రిన్సిపల్ రఘుపాత్రుని వాసంతి, అధికారులు, ఉపాధ్యాయునిలు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు విజయవంతం



**ఇచ్ఛాపురం, అక్టోబరు6(వార్త):** కేశుపురం గ్రామం నూతన సచివాలయం ప్రాంగణంలో ఉచిత మెడికల్ క్యాంప్ మరియు రక్తదాన మరియు కంటి శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ ప్రారంభించారు. ఐటీడీపీ మండల కన్వీనర్ నరేంద్ర రెడ్డి జన్మదిన వేడుకలలో భాగంగా నిర్వహించారు. ఈ బ్లడ్ క్యాంప్ లో 32మంది రక్తదానంచేశారు,కంటి శిబిరంలో 52 మంది పరీక్షలు నిర్వహించారు. 15 మందికి అద్దాలు ఇచ్చారు, కంటి ఆపరేషన్ కి 12 మంది, మెడిసిన్ 20 మందికిఇచ్చారు. అలానే మెగా మెడికల్ క్యాంప్ లో సుమారు 200 వైద్యం సేవ చేసే మందులు అందించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాస్,మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు పద్మ పద్మనాభం, సహదేవ్, కామేశ్వర రావు, హరిక్రిష్ణ,భీమరాజు,దుర్యోధన, యువరాజు, బి.రాజేంద్ర ప్రసాద్,పి. పరసరామ్,శంకర్ నారయణ , పి.పురుషోత్తం, బి శ్యామ్, గుజ్జు బీమరాజ్, పి జగ్గయ్య, ఎం జోగారావు,ఎస్.గణేష్, తిమ్మరాజు, ఎం.నీలాద్రి, ఎన్.చంద్రమణి, ఎం.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రాష్ట్రస్థాయి పోటీలకు 36 మంది ఎంపిక



**నరసన్నపేట, అక్టోబరు 6(వార్త):** రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో భాగంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 36 మంది ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయురాలు జ్యోతి రాణి తెలిపారు. నరసన్నపేట మండలం సత్యవరం జడ్పీ పాఠశాలలో బాలురు, బాలికలకు హెచ్ఎం వకులాదేవి ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు చేపట్టారు. 14, 17, 19 విభాగాల్లో బాల, బాలికలను ఎంపిక చేశారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీల్లో వీళ్లు పాల్గొంటారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించాలి

**- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను వైద్య విద్యకి దూరం చేసే కుట్రలు విడనాడాలి**

**- జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం**

**అందజేసిన జేసీసీ నాయకులు**



**శ్రీకాకుళం, అక్టోబరు 6(వార్త):** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల జెఏసి నాయకులు కోరుతూ శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కి వినతి పత్రాన్ని అందజేసారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ విద్యార్థులను వైద్య విద్యకి దూరం చేసే విధానాలు ప్రభుత్వం విడనాడాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల నాయకులు అంతా కలసి గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలుసుకుని వినతిపత్రాన్ని అందజేసారు. రాష్ట్రంలో ఉండే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలో ప్రైవేటికించాలని సర్కారు తీసుకున్న నిర్ణయం దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులు వైద్య విద్యకి దూరం అయ్యే ప్రమాదం ఉందని వారు ఆవేదనను వ్యక్తం చేసారు. ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నిర్వహించాలని అంతా కోరుకుంటున్నారని తెలియజేసారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నామని చెబుతున్న ప్రభుత్వం వైద్య విద్యను అందజేసే మెడికల్ కళాశాలలు ప్రైవేటికరించేందుకు సిద్ధపడటం దారుణమని పేర్కొన్నారు. తమ ఆవేదనను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని వారంతా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కి విజ్ఞప్తి చేసారు. జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేసిన తర్వాత దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల నాయకులు మాట్లాడుతూ అందరూ చదువుకోవాలన్నదే అంబేద్కర్ ఆశయాలకి మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే తూట్లు పొడిచినట్లవుతుందని ఆవేదనను వ్యక్తం చేసారు. రాష్ట్రంలో అణగారిన,బహుజన,మైనార్టీ వర్గాలను వైద్య విద్యకి దూరం చేసే కుట్రలు తమను ఆందోళనకి గురిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులు,సంస్థలకి కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడటం దుర్మార్గమని మండిపడ్డారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం సర్కారుకి తగదన్నారు. లక్షల కోట్లు అప్పులు చేసిన ప్రభుత్వాలు మెడికల్ కాలేజీల నిర్మాణాల కోసం అవసరమైన నిధులు ఖర్చు చేయలేరా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకూ మెడికల్ కాలేజీల ప్రైవేటికరణకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొనేందుకు దళితులు-ఆదివాసీలు-బహుజనులు-మైనార్టీలు అంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల జెఏసి నాయకులు తైక్వాండో శ్రీను,డా కంఠ వేణు,ధర్మాన రామ్ మనోహర్ నాయుడు,ఎస్.వి.రమణమాధిగ , మహిబుల్లా ఖాన్ , అమిరుల్లా బేగ్ , రౌతు శంకర్ రావు , బాడాప దేవభూషణరావు, గుండబాల మోహన్ , ఎం.ఏ బేగ్ ,పొన్నాడ రుషి,ముంజేటి కృష్ణమూర్తి, యజ్జల గురుమూర్తి, వైశ్యరాజు మోహన్ ,గద్దెబోయిన కృష్ణారావు ,నీలాపు ముకుందరావు,నల్లబారిక శ్రీను,పెయ్యల చంటి,అబ్బాస్ ,సింకు రమణ,అరిబారిక రాజు,నేతల అప్పారావు ,కొత్తూరు సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## హరిశ్చంద్రపురం విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపిక

**కోటబొమ్మాళి, అక్టోబరు 6 (వార్త):** హరిశ్చంద్రపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కరాటే విభాగంలో కె. శ్యాముక్కుమార్ (అండర్ 14), నెట్బాల్ విభాగంలో (అండర్ 19) కేటగిరిలో ఎస్. లక్ష్మణ, కె. పార్థసారధి, అండర్ 17 కేటగిరిలో జి. షణ్ముఖ, ఎం. హరికృష్ణ, అండర్ 14 కేటగిరిలో వి. జగదీష్, కె.రవ%జీ%ణ, ఎం. యేగశ్వరరావులు శ్రీకాకుళం జిల్లా జట్టుకి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నూక లక్ష్మణరావు సోమవారం తెలిపారు. ఆదివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, శ్రీకాకుళం శ్రీచైతన్య స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే, నెట్బాల్ పోటీలలో ఈ విద్యార్థులు విజయం సాధిం చారని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, ఉపాధ్యాయులు దేవాది నాగరాజును పాఠశాల ప్రదానోపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం



**పోలాకి, అక్టోబరు 6(వార్త):** పోలాకి మండలం గొల్లలవలస ప్రాథమిక పాఠశాలలో సోమవారం హెచ్.ఎం గిరిధర్ ఆధ్వర్యంలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. దసరా సెలవుల అనంతరం పాఠశాల పునః ప్రారంభం కావడంతో సెలవుల్లో ఇచ్చిన వర్క్ విద్యార్థులు చేశార లేదని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈనెలలో ఫర్మేటివే-2 పరీక్షలు జరుగుతాయని విద్యార్థులను ఇంటి వద్ద చదివేలా చూడాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మానవాళికి ఆదర్శం వాల్మీకి జీవితం




**కోటబొమ్మాళి, అక్టోబరు 6 (వార్త):** మహర్షి వాల్మీకి జీవితం మానవాళికి ఆదర్శమని భగవద్గీత ప్రచారకర్త సనపల కరుణ కుమార్ అన్నారు. సోమవారం మండలం లోగల ఊడికలపాడు శ్రీరామక్షేత్రంలో ఆయన గ్రామస్థులతో కలిసి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పోషణ కోసం వేటగాడుగా ఉన్న వాల్మీకి దొంగగా మారి దారి దోపిడాలు చేశారని, ఆ తర్వాత నారద మహాముని దివ్యోపదేశంతో కొన్ని సంవత్సరాలుగా ధ్యానంలో ఉన్నారన్నారు. ఆ తర్వాత రామాయణ కావ్యాన్ని రచించారని ఆయన తెలిపారు. మనిషిలో మార్పు వస్తే మహర్షి కాగలరని నిరూపించింది వాల్మీకి మహర్షియని ఆయన గుర్తుచేశారు. వాల్మీకి మహర్షి జీవితం మానవులకు ఆదర్శప్రాయమని, ఆయన జీవితాన్ని ముందు తరాలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు హనుమంతు వెంకటరావు, మెండ తిరుపతిరావు, సనపల రవణమ్మ, కె. సత్యన్నారాయణ, హనుమంతు మాధవరావు, సనపల విష్ణుమూర్తి, నేతింటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## నరసన్నపేట మండలానికి మూడు అవార్డులు




**నరసన్నపేట, అక్టోబరు 6(వార్త):** జిల్లాలో ఇటీవల నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నరసన్నపేటలో మూడు విభాగాలకు అవార్డులు దక్కాయి. లుకలాం ఎంపీపీ పాఠశాలకు సైతం అవార్డు వచ్చిందని హెచ్ఎం శంకర్ నారాయణ, బదిలీపై వెళ్లిన హెచ్ఎం బలగ రమణయ్య తెలిపారు. నరసన్నపేటలోని బీసీ బాలికల హాస్టల్, రైతు బజార్కు అవార్డులు రావడంతో వారిని పలువురు అభినందించారు.


# గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలి



**ఇచ్ఛాపురం, అక్టోబరు6(వార్త):** శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో స్కూల్ చైర్మన్ డి కృష్ణమూర్తి రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం. ముకుందరావు స్కూల్ విద్యార్థినులకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు.ఆయన మాట్లాడుతూ పిల్లల కిడ్నాప్?లు, వారిపై వేధింపులు, లైంగికవేధింపులు జరుగుతున్న కేసులను మనం ఎప్పటికప్పుడూ చూస్తూనే ఉంటున్నా సరే కొందరు తల్లిదండ్రులు పిల్లలకు కొన్ని సెన్సిటివ్ విషయాలు నేర్పేందుకు ఇబ్బంది పడుతున్నారని, పిల్లలకు ఆ విషయాలపై అవగాహన లేకుంటే ఇలాంటి దారుణాలు జరుగుతూనే ఉంటాయి కాబట్టి తమ పిల్లలను కాపాడుకోవాలి అనుకునేవారు. కొన్ని విషయాలు పిల్లలతో చర్చించాలి అన్నారు. ఆలస్యం కాకముందే వారికి మంచి స్పర్శ, చెడు స్పర్శ వంటి వాటిపై అవగాహన కల్పించాలని అలాగే ఎవరైనా తమతో ఎలాగా మాట్లాడుతున్నారో గమనించాలని ఆడపిల్లలుతీసిన ఫోటోలను సోషల్ మీడియా అప్లోడ్ చేసి బ్లాక్మెయిల్ చేసే అవకాశాలు కూడా ఉన్నాయని కాబట్టి దీనిపై అవగాహన పెంచుకోవాలని ఏమైనా సమస్యలు ఉంటే యాజమాన్యానికి తెలియజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూరి ఉపాధ్యాయులు సురేఖ పట్నాయక్, శాంతి పాత్రో పాల్గొన్నారు.

## రోడ్డు మీదకు వచ్చిన మొక్కలు

**సారవకోట, అక్టోబరు 6(వార్త):** సారవకోట నుంచి బొంతు వెళ్లే మార్గంలో హైవేపై పిచ్చి మొక్కులు ఏపుగా పెరిగాయి. బ్యారియర్ (రక్షణ కవచం)ను దాటి మెయిన్ రోడ్డు పైకి మొక్కలు విస్తరించాయి. ఇలాగే వదిలేస్తే వాహనదారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. హైవే సిబ్బంది స్పందించి చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



# శ్రీముఖలింగంలో కార్యకర్తలతో కృష్ణచైతన్య




**జలుమూరు, అక్టోబరు 6 (వార్త):** జలుమూరు మండలం శ్రీముఖలింగం గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తలతో కృష్ణ చైతన్య కార్యక్రమంలో యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొన్నారు. ముందుగా ఆయన శ్రీముఖలింగ మధుకర్ ఈశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం శ్రీముఖలింగం-కరకవలస క్లస్టర్ పెద్ద దూగాం-చిన్న దూగాం గ్రామ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ, కార్యకర్తల సంక్షేమానికే డిజిటల్ బుక్ ఏర్పాటు చేశామని, కూటమి పాలనలో కార్యకర్తలపై జరుగుతున్న దాడులకు రానున్న జగనన్న సంక్షేమ రాజ్యంలో తగిన ప్రతిచర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా, కార్యకర్తల అనుకూల పాలన కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బగ్గ రామకృష్ణ, మండల అధ్యక్షులు పైడి విటల్ రావు, యూత్ అధ్యక్షులు జుత్తు నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546